



జ్యోతి ప్రజ్వలనతో పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

కుప్ప కూలిన వంతెన



కూలిన వంతెనను చూస్తున్న గ్రామస్థులు

- ఆందోళనలో ఆదివాసీ ప్రజలు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి సమస్యను పరిష్కరించాలని స్థానికుల డిమాండ్
- నాసిరకం పనులపై అధికారికి, కాంట్రాక్టర్‌కు చెప్పినా.. వినలేదు

నార్నూర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రాంతమైన మండలంలోని మలంగి గ్రామ పంచాయతీ పరిధిలోని బారిక్‌రావు గూడ గ్రామం వద్ద ఆదివారం రాత్రి వంతెన కుప్ప కూలింది. దీంతో (6వ పేజీలో....)

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల.. నిర్వహణకు కృషి

- స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్
- పట్టణ శివారులో ఉత్సాహంగా రాష్ట్రస్థాయి పోటీలు
- క్రీడాకారుల ఉత్తమ ప్రతిభ

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలను ఆదిలాబాద్ కేంద్రంగా నిర్వహించేలా కృషి చేస్తామని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. పట్టణ శివారులోని ఓక్లే ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ రాష్ట్ర స్విమ్మింగ్ పోటీలను నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే పోటీలను తొలిరోజు రాష్ట్ర అధ్యక్షుడితో పాటు కార్యదర్శి ఉమేష్, కోశాధికారి క్రిష్ణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 400 మంది బాలబాలికలు పోటీల్లో పాల్గొనేందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ... ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయిలో కూడా ఇక్కడ పోటీల నిర్వహణకు అవకాశం ఇస్తామని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఈనెల 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. జాతీయ స్థాయిలో కూడా క్రీడాకారులు మంచి ప్రతిభను చాటాలని సూచించారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిని రవికుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడంలో ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఇందులో డీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారధి, స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయిని రవి కుమార్, కొమ్ము కృష్ణ, ఆధిత్య ఖండేష్కర్, లాలామున్న, హరిచరణ్, తదితరులు పాల్గొన్నారు.



స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

జాతీయ ఖోఖో పోటీలకు బుగ్గారం విద్యార్థిని

నేరడిగొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గారం గ్రామంలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటారు. ఖోఖో తో పాటు రెజ్లింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి సోమవారం తెలిపారు. కళాశాలలో హెచ్ఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న జి. గంగసాగర ఖో-ఖో పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని, ఇదే నెలలో ఉత్తర ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ పోటీలో పాల్గొననుందని తెలిపారు. కాగా, జాతీయ స్థాయికి ఎంపికైన గంగాసాగరతో పాటు రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన నిఖిత, దివ్యలను అధ్యాపక బృందం అభినందించారు.



శివాలయం వద్ద భక్తుల సందడి

కైలాస్‌టేకిడి వద్ద భక్తుల కిటకిట

బోథ్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కైలాస్‌టేకిడి ఆలయం నాల్గో రోజు జాతర సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. సోమవారం ఆలయం వద్ద లింబాజి మహరాజ్ దంపతులు హోమగుండం వద్ద పూజలు చేసి పూర్ణాహుతి నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. క్యూలైన్‌లో నిలబడి శివలింగాన్ని దర్శించుకున్నారు. భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. వలంటీర్లు పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు.



పల్లెల్లో 'పంచాయతీ'.. లొల్లి!

- హోరెత్తుతున్న సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థుల ప్రచారం
- ఇంటింటికీ తిరుగుతూ.. ఓటర్ల మద్దతు కూడగడుతున్న అభ్యర్థులు
- ముగిసిన మూడు విడతల నామినేషన్ల ఘట్టం
- నేటితో ముగియనున్న మొదటి విడత ప్రచారం

జిల్లాలో పంచాయతీ పోరు తారాస్థాయికి చేరింది. ఓ వైపు విపరీతమైన చలితీవ్రత ఉండగా.. మరోవైపు అభ్యర్థుల ప్రచారంతో పల్లె రాజకీయాలు హీటెక్కుతున్నాయి. గ్రామాల్లో ఎటు చూసినా ఎన్నికల పైనే చర్చ సాగుతోంది. హోటళ్లు, ప్రధాన కూడళ్లు, వీధుల్లో ఏ నలుగురు కలిసినా.. వీటిపైనే చర్చించుకుంటున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీలు సైతం అభ్యర్థులను ప్రకటించగా.. వారి గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నాయి.

గ్రామాల్లో ఎన్నికల సందడి

ఆదిలాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలిపిస్తే ఇది చేస్తాం... అది చేస్తాం అంటూ అభ్యర్థులు హామీలు గుప్పిస్తున్నారు. వివిధ రకాల ఆఫర్లు ప్రకటిస్తున్నారు. ఇక విందులకు (దావత్) లెక్క లేకుండానే పోయింది. అభ్యర్థులు, వార్డు మెంబర్లుగా పోటీ చేస్తున్న వారు గ్రూపులుగా విడిపోయి ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మొదటి విడత ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పోలింగ్ కోసం అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేసుకుంటున్నారు. రెండవ విడత, మూడవ విడత ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా చేస్తున్నారు. ఓటర్లు ఎవరికి మద్దతుగా నిలుస్తారో? ఫలితాలు వచ్చేంత వరకు వేచి చూడాల్సి ఉందంటున్నారు.

ఓట్ల కోసం ఉరుకులు పరుగులు

జిల్లాలో రోజురోజుకూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో చలి తీవ్రత మరింత పెరిగిపోతోంది. గత రెండు రోజులుగా సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు న మోదవుతున్నాయి. పల్లెల్లో ఉదయం, రాత్రి వేళలోనే ప్రచారం సాగుతుంది. తీవ్రమైన చలి వణికిస్తున్నా.. ఓట్ల కోసం అభ్యర్థులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. చలి తీవ్రత నుంచి కాపాడుకునేందుకు వెచ్చని దుస్తులు ధరించి ప్రచారానికి దిగుతున్నారు. వీధుల్లో చలి మంటలు వేసుకుంటూ ఎన్నికల ప్రచారం పైననే చర్చిస్తున్నారు. చలిమంటల వద్దనే పంచాయతీ ఎన్నికలపై కీలకమైన చర్చ సాగుతోంది. రాత్రీ, పగలు (తరువాయి 6వ పేజీలో....)

అభ్యర్థుల్లో మొదలైన టెన్షన్..

పోలింగ్‌కు సమయం దగ్గర పడడంతో అభ్యర్థుల్లో టెన్షన్ కనిపిస్తోంది. సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థు ల్లో కలవరం మొదలైంది. ప్రచారానికి సుమారు వారం రోజులు మాత్రమే గడువు ఇవ్వడంతో అభ్యర్థులు గ్రా మాల్లో ప్రచారం ముమ్మరం చేశారు. వారికి కేటాయించిన గుర్తులతో ఇంటింటికీ తిరుగుతూ తలుపులు తడుతున్నారు. ఓటర్లను కలుస్తూ తమకు మద్దతుగా నిలవాలని వేడుకుంటున్నారు. ఎంత మంది పోటీలో ఉన్నా.. తమకే ఓటువేయాలని అభ్యర్థిస్తున్నారు. మూడు విడతలుగా ఎన్నికలు జరగనుండగా.. ఈనెల11న మొదటి విడత పోలింగ్ జరగనుంది. దీంతో 48 గంట ల ముందే ప్రచారం నిలిపి వేయాల్సి ఉండడంతో మొ దటి విడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వరకు ప్రచారం నిలిచిపోనుంది. రెండో వి డత ఎన్నికలకు సంబంధించి ప్రచారం మరింత ఊపందుకుంది. ఈనెల 14న రెండో విడత ఎన్నికలు జరగనున్నాయి. మరోపక్క మూడో విడత ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఘట్టం కూడా పూర్తయ్యింది. దీనికి సంబంధించి ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతుంది. అంతేకాకుండా ఈనెల 17న మూడో విడతకు ఎన్నికలు జరగనున్నాయి.



నేడు నామినేషన్ల ఉప సంహరణ

బోథ్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సోనాల మండలాలలో గ్రామ పంచాయతీలో సర్పంచ్ వార్డు సభ్యులుగా పోటీ చేసేవారు ఉపసంహరించుకునే విధానం మంగళవారం మధ్యాహ్నం 3గంటల వరకు సమయం ఉందని బోథ్, సోనాల గ్రామాల కార్యదర్శులు పి.అంజయ్య, రమణయ్యలు తెలిపారు. పోటీదారులు ఎవరైనా తమ నామినేషన్ ఉపసంహరించుకోవాలంటే మధ్యాహ్నం మూడు గంటలలోగా కార్యాలయానికి రావాలని వారు ఈ సందర్భంగా సూచించారు.

రేపటి నుంచి సోయాబీన్, 11 నుంచి మొక్కజొన్న కొనుగోళ్ల నిలిపివేత

బోథ్, డిసెంబరు 8(ఆంధ్రజోతి)): బోథ్ మార్కెట్ యార్డులో 11 నుంచి మొక్కజొన్న 9 నుంచి సోయాబీన్ కొనుగోలు శాశ్వతంగా నిలిపి వేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి గోలిస్వామి తెలిపారు. రైతులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మార్కెట్ యార్డుకు తమ పంటలను ఆయా తేదీలలో సాయంత్రం 6గంటలకు తీసుకు రావాలని ఆయన పేర్కొన్నారు.

నేరడిగొండలో మొక్కజొన్న కొనుగోళ్ల నిలిపివేత

నేరడిగొండ: మండలం కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని డిసెంబరు 9న (మంగళవారం) నుంచి శాశ్వతంగా నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రైతులు తమ వద్ద ఉన్న మొక్కజొన్న పంటను మంగళవారం సాయంత్రం 6 గంటల లోపు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే పంటను స్వీకరించమని స్పష్టం చేశారు. అలాగే, రైతులు తీసుకొచ్చే పంట నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటేనే కొనుగోలు చేస్తామని, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఆదివాసీ భవన్ ప్రారంభం

తలమడుగు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివాసీ భవన్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన ఆదివాసీలకు సరైన ప్రదేశం లేక హోటళ్ల వద్ద, చెట్ల కింద ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అద్దె భవనాన్ని తీసుకొని ఆదివాసీ భవనం ప్రారంభించామన్నారు. ఈ భవనం ఆదివాసీలతో పాటు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇందులో ఆదివాసీ నాయకులతో పాటు ఖపర్‌దేవి, ఉమ్రి, కోసాయి, దేగమ్మ, ఝరి, పల్సి(బి), డోర్లీ, ఆయా గ్రామాల ఆదివాసీలు పాల్గొన్నారు.

మరో కశ్మీర్..

- జిల్లాలో అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు
- ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో 7.7 డిగ్రీల సెల్సియస్

6



జాతీయ రహదారిపై కమ్ముకున్న దట్టమైన పొగమంచు

అభ్యర్థులు జమా, ఖర్చుల లెక్క చూపాలి

- జిల్లా ఎన్నికల జమ, ఖర్చుల పరిశీలకురాలు విజయ

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు జమ ఖర్చుల లెక్క చూపాలని జిల్లా ఎన్నికల ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ విజయ సూచించారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించిన నియమ నిబంధనలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం ఐదు వేలు, అంతకుమించి జనాభా గల గ్రామపంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థి రూ.2,50,000 వరకు ఖర్చు చేయొచ్చన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధికారి విజయ

5వేల కంటే తక్కువ జనాభా గల గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి రూ.1,50,000 వరకు మాత్రమే ఖర్చు చేయాలన్నారు. 5వేలు, అంతకుమించి జనాభా గల గ్రామపంచాయతీ, వార్డు సభ్యుడు రూ.50 వేల వరకు ఖర్చు చేయవచ్చని, 5వేల కంటే తక్కువ జనాభా గల గ్రామపంచాయతీ, వార్డు సభ్యుడు రూ.30వేలు వరకు ఖర్చు చేయాలన్నారు. పోటీలో పాల్గొన్న అభ్యర్థులు సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఎన్నికలకు సంబంధించిన పూర్తి జమ ఖర్చు వివరాలను చూపించాలన్నారు. ఎలాంటి అవక తవకలు లేకుండా ఎన్నికల జమ ఖర్చు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఎన్నికల జమ ఖర్చులకు సంబంధించిన ఆడిట్‌ను రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో 8, 10, 14వ తేదీల్లో తనిఖీ చేస్తామని, మొదటి విడత తనిఖీకి రాని అభ్యర్థులు పదో తేదీ రోజు జరిగే రెండవ తనిఖీకి వారి జమ ఖర్చులకు సంబంధించిన వివరాలను ఆడిట్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఎన్నికల ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ నవీనకళ, రూరల్ మండల ఎంపీఓ ఆనంద్, ఎక్స్‌పెండిచర్ సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

- ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ రాజర్షిషా సూచనలు
- ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో పోస్టల్ బ్యాలెట్ సహాయ కేంద్రాలలో పరిశీలన
- పాల్గొన్న ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్

ఉట్నూర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ సాధారణ ఎన్నికల విధుల్లో హాజరుకానున్న సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో పోస్టల్ బ్యాలెట్ సహాయ కేంద్రాలను, పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాట్లు పరిశీలించి అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ముందుగా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ సహాయ కేంద్రంలో పోలింగ్ ప్రక్రియను, ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల జూనియర్ కళాశాల వద్ద పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లోని సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించాలని సూచించారు. ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల జూనియర్ కళాశాల వద్ద పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన కౌంటర్లు ఏర్పాటు చేసి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని అన్నారు. భోజన వసతి, బ్యాలెట్ బాక్స్‌ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ సహాయ కేంద్రంలో పోలింగ్ ప్రక్రియను, ఇంద్రవెల్లి మార్కెట్ యార్డులో పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ముందస్తు ఏర్పాట్లు పరిశీలించుకొని, సందేహాల నివృత్తి కోసం మాస్టర్ ట్రైనర్‌ల సహాయం తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇందులో ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల ఎంపీడీఓలు రామ్‌ప్రసాద్, జీవన్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్, ఎం.ప్రవీణ్, ఆర్‌ఓలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్

ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం

ఆదిలాబాద్ టౌన్: మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో రెండవ, మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో స్టేజి -2 రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైందని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా అమలు చేయాలని సంబంధిత ఎన్నికల అధికారులను కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా శిక్షణ నోడల్ అధికారి మనోహర్, డీపీవో రమేష్, డీఎల్పీవో ఫణీందర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, ఎన్నికల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ స్క్రీనింగ్ క్యాంప్

నేరడిగొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంధంరేగడి సబ్ సెంటర్ పరిధిలో సోమవారం సికిల్ సెల్ (రక్తహీనత) స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్యాధికారి డాక్టర్ సద్దాం హాజరై గ్రామస్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సికిల్ సెల్ ఎనీమియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానం ఉన్నవారు వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ఏ. సంతోష్, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్ రెడ్డి, నర్సయ్య, ఆశా కార్యకర్త శంకీబాయి, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డాక్టర్ సద్దాం

సర్వీస్ రోడ్డుపై.. అడ్డగోలుగా పార్కింగ్!

- ఆర్టీసీ బస్సుల రాకపోకలకు, ప్రయాణికులకు తప్పని తిప్పలు

నేరడిగొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సర్వీస్ రోడ్లపై వాహనదారుల నిర్లక్ష్యం, అడ్డగోలు పార్కింగ్ కారణంగా భారీ వాహనాలు, ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రోడ్డు పక్కన ఉన్న దుకాణాల వద్దకు వచ్చే వాహనదారులు, తమ వాహనాలను రోడ్డు పైనే అడ్డదిడ్డంగా నిలిపివేయడంతో ట్రాఫిక్ స్తంభించి పోతోంది. తాజాగా నేరడిగొండ మండల కేంద్రంలోని సర్వీస్ రోడ్డులో ఇటువంటి ఘటనే చోటుచేసుకుంది. ఓ కారు ను రోడ్డుకు ఇబ్బందికరంగా పార్క్ చేయడంతో, అటుగా వచ్చిన ఆదిలాబాద్ డిపోకు చెందిన టీజీఎస్ఆర్టీసీ బస్సు ముందుకు వెళ్లలేక ఇరుక్కుపోయింది. బస్సు డ్రైవర్ ఎంత ప్రయత్నించినా కారు అడ్డంగా ఉండటంతో బస్సును తీయలేక నానా అవస్థలు పడ్డారు. దీనివల్ల బస్సులోని ప్రయాణికులు అసౌకర్యానికి గురవడమే కాకుండా, వెనుక ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు, సంబంధిత అధికారులు స్పందించాలని, అడ్డగోలు పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలని, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై అడ్డగోలు పార్కింగ్ వల్ల బస్సు వెళ్లలేని స్థితిలో ఉన్న దృశ్యం



నార్నూర్‌లో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎన్నికల వేలంపాటలు చట్టరీత్యా నేరం

7

- సమస్యాత్మక ప్రాంతాల్లో ఎస్పీ అఖిల్ మహాజన్ సూచనలు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్ ముఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులు తమ సమస్యలను ఎస్పీకి వివరించగా... వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. బాధితుల సమస్యలను పరిష్కరించినప్పుడు, సత్వర న్యాయం చేసినప్పుడు పోలీసు వ్యవస్థపై మరింత నమ్మకం పెరుగుతుందని సూచించారు. ఎలాంటి సందర్భంలోనైనా జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజల సేవల కోసం అందుబాటులో ఉంటూ విధులను నిర్వర్తిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్‌లో లోకోస్‌పై శిక్షణ తరగతులు

జైనథ్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం లోకోస్, మేరిపవచన్ పై వీఓఏలకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ సుజాత మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘం పరిధిలో 80-100 మంది సభ్యులను లక్షలాధికారులు చేసే ఉద్దేశంతోనే వారు గతంలో తీసుకున్న రుణాలు, వాటి ద్వారా వచ్చిన ఆదాయ, అభివృద్ధి స్థితిగతులను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. వీటిని మూడు నెలల వారీగా డాటాలో మెంబర్ వారిగా పొందుపరాచాలని సూచించారు. ఈ శిక్షణలో సీసీలు టి.శ్రీనివాస్‌రెడ్డి, గంగారాం, హేమలత, నాగమణి, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వేసిన ఉద్యోగులు

ఉట్నూర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రెండవ గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని ప్రభుత్వ ఉద్యోగులు ఉట్నూర్ మండలంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్నారు. ఆదివారం నుంచి ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సోమవారం ముగియనుండగా.. గ్రామ పంచాయతీ ఎన్నికల విధులకు హాజరు అయ్యే ఉద్యోగులు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయానికి చేరుకొని పోస్టల్ బ్యాలెట్ పత్రాలు అందుకొని వాటిని పూర్తి చేసుకున్నారు. అనంతరం కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదిలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాంప్రసాద్ మాట్లాడుతూ కేవలం ఎన్నికల విధులకు హాజరు అవుతున్న వారు మాత్రమే పంచాయతీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకుంటారని ఆయనర ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎన్నికల విధులు లేని వారు నేరుగా పోలింగ్ కేంద్రాలలో తమ ఓటు హక్కు వినియోగించుకుంటారన్నారు.



ఉట్నూర్‌లో పోస్టల్ బ్యాలెట్ పత్రాలు నింపుతున్న ఉద్యోగులు



పొగమంచుతో కమ్మేసిన ఆదిలాబాద్ జిల్లాకేంద్రం



బోథ్‌లో సోమవారం పగలు చలి మంటలు కాగుతున్న ప్రజలు

మరో కశ్మీర్.. ఆదిలాబాద్!

- జిల్లాలో అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు
- రికార్డు స్థాయిలో వరుసగా సింగిల్ డిజిట్స్
- శీతల గాలుల ప్రభావంతో వణికి పోతున్న జనం

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో కురుస్తున్న దట్టమైన పొగమంచుతో ఆదిలాబాద్ జిల్లా పరిసర ప్రాంతా లు మరో కశ్మీర్‌ను తలపిస్తున్నాయి. ఉదయం సాయంత్రం వేళల్లో ఎటు చూసిన దట్టమైన పొగమంచే కనిపిస్తుంది. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదవుతున్నాయి. ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో 7.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలలో పెద్దగా తేడా లేక పోయిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. దీంతో పగలు, రాత్రి తీవ్రమైన చలే కనిపిస్తుంది. పట్టపగలే చలి మంటలు వేసుకుంటు వెచ్చదనం పొందుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు, వ్యవసాయ కూలీలు, మున్సిపల్ కార్మికులు తీవ్రమైన చలితో గజగజ వణికి పోతున్నారు. మార్నింగ్ వాక్ చేసేవారంతా సూర్యుడు ఉదయించిన తర్వాతనే ఆలస్యంగా వాకింగ్ వెళ్తున్నారు. సోమవారం జిల్లా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 28.3 డిగ్రీలు కాగా, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 7.7గా నమోదయ్యాయి. ప్రతియేటా డిసెంబరు మాసంలోనే కనిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. చలి తీవ్రతతో జర జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు అర్లి(టి) గ్రామంలో నమోదవుతున్నాయి. తాజాగా అర్లి(టి)లో 7.4 డిగ్రీల అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో చలి ప్రభావం తీవ్రంగా కనిపిస్తుంది. భీంపూర్ మండలం మారుమూల గిరిజన గ్రామమైన అర్లి(టి)లో అన్ని కాలాల ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. వేసవి, వాన, శీతకాలాలు మూడు అధికంగానే ప్రభావాన్ని చూపుతాయి. ఈ గ్రామంలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో పాటు కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. దీని తర్వాత బజార్‌హత్నూర్, బోథ్, సాత్నాల, మావల మండలాల్లోను అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లోనే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆశ్చర్యాన్ని కల్పిస్తుంది. ముఖ్యంగా గుట్ట ప్రాంతాలు, కొండలు, దట్టమైన అడవులు, నదులు, లోతైన ప్రాంతాల్లోనే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు సంబంధిత వాతావరణ అధికారులు చెబుతున్నారు. సోమవారం బజార్‌హత్నూర్‌లో 8.2, ఆదిలాబాద్ అర్బన్ 8.3, బోథ్ పొచ్చెరలో 8.5, తాంసిలో 8.6, ఆదిలాబాద్ రూరల్‌లో 8.0 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పగలు సైతం చలి మంటలు

బోథ్: మండలంలో చలి తీవ్రత అధికంగా ఉంది. ఎనిమిది డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవడంతో మండల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పూరిగుడిసెల్లో ఉన్నవారు చలి తాకిడికి సతమతమవుతున్నారు. రాత్రిపూట బయటకు రావాలంటేనే జంపుతున్నారు. ఉదయం పూట ప్రభుత్వ కార్యాలయాలకు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు అసహనానికి గురవుతున్నారు. ప్రభుత్వం చలి తీవ్రత దృశ్యా పాఠశాలలకు సెలవు ప్రకటించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

యువత రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రానున్న భవిష్యత్తు యువతదేనని, రాజకీయ రంగాల్లో యువకులు ముందుండాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపునిచ్చారు. గుడిహత్నూర్, బజార్‌హత్నూర్ మండలాలకు చెందిన పలువురు యువకులు సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అనిల్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన యువతకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. యువకులు ఉత్సాహంగా పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

నేరడిగొండ: మండలకేంద్రంలోని కుంటాల జలపాతానికి వెళ్లే రోడ్డులో ఉన్న శివాలయంలో జరుగుతున్న రామకోటి ఉత్సవాలలో భాగంగా, రెండవ రోజైన సోమవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దైవ సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొనే భాగ్యం కలగాలంటే ఎంతో అదృష్టం ఉండాలని అన్నారు. ఇందులో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, పండరీ, దేవేందర్ రెడ్డి, దుబ్బుల చంద్రశేఖర్, తదితరులున్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

పల్లెల్లో 'పంచాయతీ' లొల్లి!

(5వ పేజీ తరువాయి...)

అనే తేడా లేకుండానే చలి ప్రభావం కనిపిస్తుంది. ప్రస్తుతం అభ్యర్థులు ఎన్నికల ఫీవర్, చలి తీవ్రతతో సతమతమవుతున్నారు.

పల్లెల్లో సందడి..

జిల్లాలో 473 పంచాయతీలు, 3870 వార్డులకు గాను మూడు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచ్ అభ్యర్థుల ప్రచార పర్వంతో పల్లెల్లో సందడి నెలకొంది. ఎక్కడ చూసిన వీటిపైనే చర్చ జరుగుతుంది. అభ్యర్థులు ఓటరు జాబితాలతో కుస్తీ పడుతున్నారు. ఓటర్ల వారీగా లెక్కలు వేసుకుంటున్నారు. ఎవరికి? ఎందరు? అనుకూలంగా ఓటు వేస్తారో? ముందుగానే పసిగడుతూ గెలుపోటములు అంచనా వేసుకుంటున్నారు. మరికొందరు కులాల వారీగాను లెక్కలు కడుతున్నారు. ఆయా కులస్తుల ఓట్లు పెద్ద మొత్తంలో తమకే వస్తాయని భరోసా వ్యక్తం చేస్తున్నారు. కానీ ఓటర్లు మాత్రం ప్రచారానికి వచ్చిన అభ్యర్థులందరికీ ఓటు వేస్తామని హామీనివ్వడంతో ఎవరికి మద్దతుగా నిలుస్తారో? తెలియక అయోమయానికి గురవుతున్నారు. కాగా ఉదయం, సాయంత్రం రెండు పూటలు అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం, అలాగే గల్లీల్లో తమ అభ్యర్థులకు అనుకూలంగా నినాదాలు చేసుకుంటూ ప్రచారం నిర్వహించడంతో గ్రామాల్లో కోలాహలం కనిపిస్తుంది. మొత్తానికి పల్లెల్లో ఎన్నికల ప్రచారంతో సందడి సందడిగా కనిపిస్తుంది.

కుప్ప కూలిన వంతెన

(5వ పేజీ తరువాయి....)

ఈప్రాంత వాసులకు రాకపోకలు ఇబ్బందిగా మారింది. అసలు తమ గ్రామానికి ప్రభుత్వ అధికారులు సందర్శించి సమస్యలు తెలుసుకోరని, ఇప్పుడు వంతెన కూలడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి రావాలంటే పెద్ద వాగు దాటాల్సి వస్తుంది. యేటా సమస్యలపై జిల్లా యంత్రాంగానికి విన్నవించినా పరిష్కారం చూపడం లేదు. గతంలోనే ఈ వంతెన సీసీ తోడు నాసిరకం పనులపై ప్రభుత్వ అధికారి, కాంట్రాక్టర్‌కు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా కలెక్టర్ స్వయంగా తమ గ్రామాన్ని సందర్శిస్తే తప్ప రాష్ట్ర ప్రభుత్వానికి తమ సమస్యలు అర్థం కావని ఆదివాసీలు పేర్కొంటున్నారు. వెంటనే కొత్తగా రెండు వంతెనల పనులు ప్రారంభించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పనులు చేపట్టాలని చాహకటి కొద్దు, సేడ్మక గంగారాం, పూసాం మోతీరాం, మడావి లచ్చు, కుమ్ర దేవురావు కోరారు.

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

గుడిహత్నూర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో సోమవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిస్ బ్రెయిలీ, స్టీఫెన్ హాకింగ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో ఉదయ్ రావు మాట్లాడుతూ దివ్యాంగులు అనేక రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు పథకాలు సద్వినియోగం చేసుకోవలన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు బి.వెంకన్న, ఐఈ ఆర్పీ అశోక్, సీఆర్పీలు రమేష్, సావేందర్, ఎంఐసీ కేశవ్, సీసీవో ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

దివంగత ఏపీవో జనరల్‌కు నివాళి

ఉట్నూర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో రెండు దశబ్దాల క్రితం సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ వీఎస్‌వీకే శాస్త్రీ మృతి చెందడం బాధాకరంగా ఉందని జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో వీఎస్వీకే శాస్త్రీ మృతి చెందినట్లు సమాచారం రావడంతో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లర్పించారు. ఇందులో జిల్లా రాయిసెంటర్ అధ్యక్షుడు మేస్రం దుర్గుపటేల్‌తో పాటు సంక్షేమ ఉద్యోగులు, ఆదివాసీ నాయకులు దేవ్‌రావు, కుంర విఠల్, తదితరులు పాల్గొన్నారు.



హతురాలి మృతదేహం వద్ద నిందితుడు నగేష్

సహజీవనం.. ఆపై అనుమానం...

- రాడ్‌తో కొట్టి, కత్తితో పొడిచి మహిళ హత్య
- బైంసాలోని సొంత టీ పాయింట్‌లోనే ఘటన
- ఊపిరి పోయే వరకు పక్కనే కూర్చున్న నిందితుడు
- కేసు దర్యాప్తు చేస్తున్న చేస్తున్న పోలీసులు

బైంసా, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన బైంసాలో శుక్రవారం మహిళ హత్య ఘటన చోటు చేసుకుంది. సహ జీవనం చేస్తున్న మహిళపై అనుమానం పెట్టుకున్న వ్యక్తి ఒకరు సదరు మహిళను రాడ్‌తో దాడి చేసి కత్తితో పొడిచి అంతమొందించారు. ఉపాధి కోసం గాను ఇద్దరు కలిసి పెట్టుకున్న టీ పాయింట్ లోనే హత్యోదంత ఘటన చోటు చేసుకుంది. బైంసా టౌన్ సీఐ గోపీనాథ్ తెలిపిన కథనం ప్రకారం... ఘటన వివరాలు ఇలా ఉన్నా యి... బైంసా మండలంలోని కుంసర గ్రామానికి చెందిన అశ్విని (28)కి పది సంవత్సరాల క్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. కొంత కాలం గా కుటుంబ కలహాలతో అశ్విని తన భర్తకు దూరంగా ఉంటోంది. పిల్లలిద్దరిని కుంసర గ్రామంలోని తన తల్లి వద్ద ఉంచి చదివిస్తోంది. ఇదేసమయంలో బైంసాలోని అంబేడ్కర్ నగర్ కాలనీకు చెందిన నగేష్ (28)తో పరిచయం ఏర్పడటం, అది కాస్తా సహ జీవనానికి దారి తీసింది. ఇందులో భాగంగానే ఇద్దరు కలిసి సంతోషిమాత మందిర ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకొని సహజీవనం కొనసాగిస్తున్నారు. ఉపా ది కోసం గాను సంతోషిమాత మందిర ప్రాంతంలోని ఒక షాపింగ్ కాంప్లెక్స్‌లో నందిని టీ పాయింట్‌ను ప్రారంభించారు. సోమవారం రోజులాగే ఉదయం వేళ టీపాయింట్‌ను తెరిచారు. కాగా ఇరువురి మధ్య గోడవ జరిగింది. అశ్విని వ్యవహారశైలిపై అనుమానం వ్యక్తం చేస్తూ నగేష్ దాడికి తెగబడ్డాడు. ఇదే సమయంలో నగేష్ టీపాయింట్‌కు చెందిన శ్వటర్‌ను కిందికి దించివేసి లోపలి బాగంలో అశ్వినిని రాడ్‌తో కొట్టి, కత్తితో విచక్షణరహితంగా గొంతు కోసం హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం కొన ఊపిరితోనున్న అశ్విని చివరి శ్వాస విడిచిపెట్టి విగతజీవిగా మారే వరకు నిందితుడు నగేష్ ఆమె పక్కనే కూర్చున్నాడు. సంబంధిత సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలికి చేరుకునే సమయం వరకూ నిందితుడు అక్కడే ఉండటం విశేషం. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ గోపీనాథ్, ఎస్ఐలు సుప్రియ, జుబేర్‌లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



అశ్విని(ఫైల్)

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు

సారంగాపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల స్వర్ణలో రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన వాజిద్ బాధిత కుటుంబసభ్యులను నాయకులు పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గం ఇన్‌చార్జీ కుచాడి శ్రీహరి రావు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంబడి రాజేశ్వర్ పార్టీ మండల అధ్యక్షులు బొల్లోజీ నర్సయ్య, నాయకులు రాకేష్, అతిక్ హమ్మద్, రవికుమార్, రాజశేఖర్‌లు ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ



పడిపూజలో పాల్గొన్న అయ్యప్పస్వాములు

కుభీర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన ప్యాట దేవన్నస్వామి 18వ సారి మాలదారణ చేసిన నేపథ్యంలో పడిపూజ ఏర్పాటు చేశారు. శివశంకర గురుస్వామి ముందుగా గణపతి, సుబ్రహమణ్య స్వామి విగ్రహాలకు పూజలు చేసి పడిపూజ ప్రారంభించారు. అయ్యప్ప స్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. మండలంలోని ఆయా గ్రామాలతో పాటు నియోజకవర్గ అయ్యప్ప స్వాములు భారీగా తరలివచ్చారు. పడిపూజలో మెట్ల పూజ భక్తులను ఉత్తేజపరిచింది. అనంతరం పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు ప్రభాకర్, డా.పెంటాజీ, సట్ల రవి, కందూర్ దత్తాత్రి, డా. శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



తానూర్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

తానూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌లో సోమవారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బైంసా ఏఎస్పీ రాజేశ్ మీనాన్ మాట్లాడారు. స్థానిక పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ డా. జానకీషర్మిల ఆదేశాల మేరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామని, గ్రామంలో ప్రధాన రహదారులపై కవాతు నిర్వహిస్తూ, ఎన్నికలు పూర్తిగా ప్రశాంతంగా నిర్వహించడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఏఎస్పీ తెలిపారు. ఎలాంటి అల్లర్లు, అశాంతిని సృష్టించే చర్యలను అసలు సహించేది లేదని, అట్టి వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐలు, మల్లేష్, సాయి, ఎస్సైలు నవనీత్ రెడ్డి, బిట్లా పెర్సిస్, అశోక్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోయా డబ్బులు రాక రైతుల ఇబ్బందులు

బోథ్, డిసెంబర్8 (ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్‌యార్డులో నెల రోజుల క్రితం సోయాబీన్ విక్రయాలు జరిపిన రైతులు సోయాబీన్ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్ మార్క్‌ఫెడ్ వారు పంటను కొనుగోలు చేసి రైతుల అకౌంట్లో ఇంత వరకు డబ్బులు వేయలేదని రైతులు వాపోతున్నారు. పత్తి పంట సీసీఐ వారికి అమ్మిన రైతులకు వారం రోజుల్లో డబ్బులు వస్తున్నాయని సోయాబీన్ పంట డబ్బులు మాత్రం రావడం లేదని వాపోతున్నారు. జిల్లా అధికారులు తక్షణమే రైతుల అకౌంట్లలో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు.

తపస్ నూతన మండల కమిటీలు ఏకగ్రీవం

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తపస్ ఇచ్చోడ డివిజన్ సమావేశాన్ని సోమవారం సంఘం జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మూడు సంవత్సరాల కాలపరిమితితో కూడిన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇచ్చోడ, నేరడిగొండ, బోథ్, సోనాల, సిరికొండ, బజార్‌హత్నూర్ మండలాలకు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలబోజు గోపికృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అంబాజీ, విఠల్ రావ్ పాల్గొన్నారు.

నర్సాపూర్(జి) సమగ్రాభివృద్ధే ధ్యేయం

- సర్పంచ్ అభ్యర్థి గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి



బ్యాట్‌గుర్తుకే ఓటు వేయాలని ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి

నర్సాపూర్(జి), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్(జి) మేజర్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బ్యాట్ (సీరియల్ నెంబర్ 3) గుర్తుపై సర్పంచ్‌గా పోటీచేస్తున్న అభ్యర్థి గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. సోమవారం ఆయన తన ముఖ్య మద్దతుదారులు కోండ్ర రమేష్, మల్లేష్, అజీమ్, ఉమర్, ఉమామహేశ్వర్, గుండోజి రవి, గోపిడి గంగారెడ్డి, రఘు, గజ్జారాం, గాదే సంతోష్, ఫసిఉద్దీన్, దయానంద్ వంటి నాయకులతో పాటు 14 మంది వార్డు సభ్యులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తన ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. స్థానిక నాయకులు శ్రీహరి రావు సంపూర్ణ మద్దతుతో తన విజయం ఖా యమని, గ్రామాభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తానని ఇంద్రకరణ్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామంలో రైతులు, చిరు వ్యాపారులకు రైతుబజార్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతానని, అలాగే గ్రామంలోని అన్ని ప్రధాన రహదారులను సీసీ రోడ్లుగా నిర్మిస్తానని తెలిపారు. అభివృద్ధి కోసం గ్రామస్థులందరూ బ్యాట్ (సీరియల్ నెంబర్ 3) గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అల్ఫోర్స్ విద్యార్థులకు ఆరు బంగారు పతకాలు



సాధించిన పతకాలతో విద్యార్థులు

భైంసా, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని అల్ఫోర్స్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు మార్షల్‌ఆర్ట్స్ కరాటే పోటీల్లో ప్రతిభను చాటుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మూడోమార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీలు జరిగాయి. ఇందులో పాల్గొన్న అల్ఫోర్స్ హైస్కూల్‌కు చెందిన అనన్య, వీణా, ప్రవహర్షిని, రుద్ర, అఫ్జలుద్దీన్, తోసిఫ్‌లు బంగారు పతకాలు సాధించారు. ఇక సిద్దేశ్వరీ, మేఘన, అతిఫా, ముఫ్లేహలు వెండి పతకాలు సాధించగా మరికొంత మంది విద్యార్థులు రజత పతకాలు సాధించారు. ప్రతిభను చాటుకొని పతకాలు సాధించిన విద్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మెన్ నరేందర్ రెడ్డి అభినందించి రాష్ట్ర స్థాయిలో పోటీల్లోనూ విజయకేతనం ఎగురవేయాలని అకాంక్షించారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బాదం ఈశ్వర్ పుట్టినరోజు సందర్భంగా కేఆర్‌కే కాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు చున్నీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు చదువు ప్రాముఖ్యత, నైపుణ్యాలు, కనీస సామర్థ్యాలన్యా పెంపొందించుకోవలన్న అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు ప్రత్యూష, అజయ్, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ అనురాధ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను ఇస్తా

▸▸ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్, సర్పంచ్ అభ్యర్థి భాగ్యలక్ష్మి

ఉట్నూర్,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ఏప్రిల్ మాసంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలోని వినాయకచౌక్ పాత బస్టాండ్‌లో ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి మేస్రం భాగ్యలక్ష్మిని ఉట్నూర్ ఓటర్లు భారీమెజార్టీతో గెలిపించాలని కోరుతూ.. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మాట్లాడారు.పేద ఆదివాసీ గిరిజన మహిళ భాగ్యలక్ష్మిని గెలిపించాలని ఆమెఆధ్వర్యంలో ఉట్నూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు.ఇప్పటికే ఉట్నూర్‌లో సీసీ రోడ్లు మురికికాలువలు అవసరమైన చోట నిర్మించడం జరిగిందని, అధికార పార్టీకి చెందిన అభ్యర్థిని గెలిపించడం ద్వారా గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కొందరు తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని నేను ఎవరిని ఎక్కడ దూషించలేదని,తనను ఎవరు నిలదీయలేదని అన్నారు.మొదటి దఫాలో ఇందిరమ్మ ఇళ్లు రానివారు అసంతృప్తికి గురికావద్దని ఏప్రిల్ మాసంలో 500 ఇళ్లను ఉట్నూర్‌కు మంజూరు చేయిస్తున్నానన్నారు.

ఎన్నికల్లో వేలం పాట

చట్టరీత్యా నేరం

● ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



హస్నాపూర్‌లో కవాతు నిర్వహిస్తున్న ఎస్పీ, పోలీసులు

ఉట్నూర్,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో వేలం పాటల ద్వారా అభ్యర్థులను ఖరారు చేయడమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని హస్నాపూర్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో కవాతు నిర్వహిం చారు. అనంతరం ప్రజల్లో మాట్లాడుతూ మద్యం, బహు మతులు, డబ్బు ప్రలోభాలకు గురికా కూడదని, నిర్భ యంగా ఓటు హక్కును ప్రజలందరూ వినియోగించు కోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను పూర్తి చేయాలన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలను చేయరాదు, రెచ్చిపోవద్దు, యువత భవిష్యత్తుపై దృష్టి సారించాల న్నారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చే యాలన్నారు. ఎన్నికల ముగింపు తర్వాత విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్‌ల నిర్వహణ చేస్తున్నామన్నారు. నార్నూర్, భీంపూర్, నాగల్‌కొండ, తాడిహత్నూర్ గ్రామాల ప్రజల కు ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్లు, 200 మీటర్ల లోపు నియమాలను పాటించాల న్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ జరగాలన్నారు.ఎన్నికలను ప్రశాంత వాతావ రణంలో నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.నార్నూర్ మండలంలోని పలు క్రిటికల్ పోలింగ్ లోకేషన్స్ ఉన్న గ్రామాలైన నార్నూర్, భీంపూర్, నాగల్‌కొండ, తాడిహత్నూర్ గ్రామాలను, ఇం ద్రవెల్లి మండల కేంద్రం, ఉట్నూర్ మండలంలోని హ స్నాపూర్ గ్రామాలను సందర్శించి జిల్లాఎస్పీ ప్రజల కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉట్నూర్ అదన పు ఎస్పీ కాజల్ సింగ్, ఉట్నూర్ సీఐ ఎం ప్రసాద్, నా ర్నూర్ సీఐ అంజమ్మ,ఎస్సైలుసాయన్న,ప్రవీణ్ సిబ్బంది పాల్గొన్నారు.

నార్నూర్: పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం సాయంత్రం నార్నూర్ మండలంలోని పలు క్రిటికల్ పోలింగ్ లొకేషన్స్ ఉన్న గ్రామాలైన నార్నూర్, భీంపూర్, నాగల్‌కొండ, తాడిహత్నూర్ గ్రామాలను సందర్శించి జిల్లా ఎస్పీ ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని, ఎవరి బలవంతం ఓటుపై ఉండకూడదన్నారు. ఎన్నికలను వేలంపాట ద్వారా నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయన్ని, వీడీసీల జోక్యం ఎన్నికల్లో ఉండకూడదని తెలిపారు. ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రశాంత వాతా వరణంలో ఎన్నికలను పూర్తి చేయాలన్నారు. ఎన్నికల నియమాలను పాటించాలని, ఎన్నికల్లో రెచ్చగొట్టే వ్యా ఖ్యలను చేయకూడదని, యువత రెచ్చిపోయి ఇలాంటి ఘటనలను చేయకూడదని పేర్కొ న్నారు. సోషల్ మీడి యాలో రెచ్చగొట్టే పోస్టులను పెట్టిన వారిపై పోలీసు చర్యలు తప్పవన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేకం గా స్పెషల్ పార్టీ బలగాలచే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజల్లో పోలీసుల పట్ల విశ్వాసం, నమ్మకం పెంపొందిం చడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్లు, 200 మీటర్ల వద్ద సూచిం చబడిన నియమా లను పాటించాలన్నారు.ఎలాంటి పరిస్థితుల్లోనైనా డయల్ 100 ద్వారా పోలీసు సహాయాన్ని సంప్రదించాలన్నారు. ఎన్నికల అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని తెలిపారు. టపాకాయలను వెలిగించకూడదన్నారు. అక్రమ మద్యం పంచుతున్నట్లు సమాచారం ఉన్న డయల్ 100 ద్వారా సమాచారం అం దించాలని, డబ్బులకు, పెరుగుతున్న ఓటు హక్కుతో ప్రలోభపడరాదని తెలిపారు. ఎన్నికల్లో కేసులు నమోదు చేయబడిన తర్వాత యువత భవిష్యత్తు సక్రమంగా ఉందన్నారు. ఎన్నికల్లో సమస్యలు సృష్టించే వారిని బైం డొవర్ చేయడం జరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పీకాజల్‌సింగ్,నార్నూర్‌సీఐ,సిబ్బంది పాల్గొన్నారు.

యువగళం

అభివృద్ధి చేసే వారికే ఓటేస్తా



నిస్వార్థంతో గ్రామ అభివృద్ధి కోసం పాటుపడే వారికి ఓటువేస్తా. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు నాకు మొదటిసారి వచ్చింది. ఈ ఓటు హక్కును నిస్వార్థంతో గ్రామం కోసం పాటుపడే వారి కోసం ఉపయోగించుకుంటా. ఎన్నికల్లో మొదటిసారి ఓటు వేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

- నారా అవంతిక

ప్రజా సమస్యల పరిష్కరించే వారికే నాఓటు



ప్రజా సమస్యలు పరిష్కరించే వ్యక్తికి ఓటేస్తా. ప్రలోభాలకు గురిచేసి డబ్బులు ఇచ్చే ఓట్లేంచు కుంటారు. అలా కాకుండా అనునిత్యం ప్రజా సమ స్యల కోసం పనిచేసే వ్యక్తికి మాత్రమే ఓటుస్తా. ప్రజా సమస్యలు పరిష్కరించకుంటే నిలదీసి అడుగుతా. తొలిసారి ఓటు వేసే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉంది

- ఆడన్ అన్వేష్, ముక్రా(బి)

ఓటు అత్యంత కీలకమైంది



ప్రజా స్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు అత్యంత కీలకమైన ఆయుధం.నేరడిగొండ మండలం, బుగ్గారం (బి) గ్రామానికి చెందిన యు వకుడు రాథోడ్ బాల్దార్ సింగ్ రానున్న సర్పంచ్ ఎన్నికల్లో తన ఓటుహక్కును తొలిసారిగా వినియో గించు కోను న్నారు. ఓటు వేయడం మన హక్కు మా త్రమే కాదు, మన బాధ్యత కూడా. నేను ఎలాంటి ప్రలోభాలకు, మాయమాటలకు లొంగకుండా, కేవ లం మా గ్రామాభివృద్ధి కోసం పనిచేసే నిజాయితీ గల నాయకుడికే నాతొలి ఓటు వేస్తాను అని స్పష్టం చేశారు.

- రాథోడ్ బాల్దార్ సింగ్

క్రైం సమాచారం

పత్తి చేనులో దొంగతనం



పత్తి దొంగతనం జరిగిన స్థలాన్ని చూపిస్తున్న రైతు

బోథ్,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రం సమీపంలోని మరలపెల్లి వెళ్లే రూట్లో ఉన్న చేనులో నుంచి దాదాపు రెండు క్వింటాళ్ల మేరకు పత్తి దొంగతనం జరగింది. దీంతో రైతు రాథోడ్‌మహేందర్‌కు దాదాపు రూ.16వేల వరకు నష్టం సంభవించింది. ఆదివారం చేనులో పత్తి ఏరి కుప్పలుగా పెట్టాడు.సోమవారం ఉదయం వెళ్లి చూసే సరికి ముల్లెలు కట్టి పెట్టి ఉంచిన చోటు నుంచి దాదాపు రెండు క్వింటాళ్ల మేరకు ఉన్న నాలుగు పత్తి ముల్లెలు దొంగలించబడ్డాయని వాపోయారు.అధిక వర్షాలతో దిగుబడి రాక రైతులు సతమతం అవుతుంటే పంట దొంగతనం జరగడంతో రైతు తీవ్ర ఆందోళన వ్యక్తపరుస్తున్నారు.రాత్రిపూట జరిగిన దొంగతనాలను పరిశీలించేందుకు పోలీసు అధికారులతో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దురుసుగా ప్రవర్తించిన ఒకరిపై కేసు నమోదు

తాంసి,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వ అధికారిపై దురుసుగా ప్రవర్తించిన ఒకరిపై కేసు నమోదైంది.మండలానికి చెందిన ఎంపీడీవో ఫోన్ లిఫ్ట్ చేయలేదని గోట్కూరి గ్రామానికి చెందిన చిలక దేవదాసు సోమవారం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన నాఫోన్ లిఫ్ట్ చేయడం లేదు. ఎందుకు పని చేస్తారు. రిజైన్ చేయాలని దురుసు మాటలతో మండిపడ్డాడు. దీంతో ప్రభుత్వ అధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏకగ్రీవ పాలకవర్గాలకు అభినందనలు

▸▸ సర్పంచులు, వార్డు సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఏకగ్రీవ సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్,డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కంటేగాం మర్లపెల్లి గ్రామాల సర్పంచులు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మర్లపెల్లి గ్రామ సర్పంచ్‌గా రాథోడ్ శీలాబాయి కంటేగాం గ్రామ సర్పంచ్ జాదవ్ సంజీవ్‌లతో పాటు వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. దీంతో వారు సోమవారం స్థానిక శాసన సభ్యులు జాదవ్‌అనిల్‌ను కలవడం జరిగింది. వీరితో పాటు ఆయాగ్రామాల వార్డు సభ్యులు ఉన్నారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచ్‌ల సంఘం మాజీఅధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి దితరులున్నారు.ఏకగ్రీవంగా సర్పంచులుగా ఎన్నుకోవడం పట్లఎమ్మెల్యే వారిని అభినందించారు. రానున్న రోజుల్లో అభివృద్ధి సంక్షేమ పథకాలు అదే విధంగా తనవంతు సహకారం అందిస్తానన్నారు.

నేరడిగొండ:గ్రామాల్లో ఐక్యమత్యానికి ప్రతీకగా నిలుస్తూ, ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన పాలకవర్గాలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఘనంగా సన్మానించారు.బోథ్ మండలంలోని మర్లపల్లి సర్పంచ్ రాథోడ్ శీలబాయి కంటే గావ్ సర్పంచ్ జాదవ్ సంజీవ్‌లతో ప్రజాప్రతినిధులు సోమవారం నేరడి గొండ మండల కేంద్రంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిని కాంక్షించి ఏకగ్రీవాలకు మొగ్గుచూపిన గ్రామస్థులను,ఎన్నికైన ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వారిని శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ తులశ్రీనివాస్,మాజీసర్పంచుల సంఘఅధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమం తీవ్రతరం చేస్తాం



బోథ్ కోర్టుకు హాజరైన ఉద్యమకారులు

బోథ్,డిసెంబరు8(ఆంధ్రజ్యోతి):రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేసి రెవెన్యూ డివిజన్‌గా గుర్తించాలని డిమాండ్ చేస్తూ 75రోజుల పాటు ఉద్యమాలు చేయడం జరిగింది.అయితే ఉవ్వెత్తిన ఎగిసిన ఉద్యమంలో పాల్గొన్న వారిపై అప్పట్లో కేసునమోదు కావడం జరిగింది. దీంతో సోమవారం బోథ్ కోర్టుకు హాజరయ్యారు. అయితే అప్పుడు మాట ఇచ్చిన ప్రకారం స్థానిక న్యాయవాది హారీష్ ఉద్యమకారులను ఉచితంగానే వాదించాడు. అయితే ఎన్ని కేసులు నమోదు చేసిన ఉద్యమాన్ని రాను రోజుల్లో తీవ్రతరం చేసి రెవెన్యూ డివిజన్ సాధిస్తామని ఉద్యమకారులు అంటున్నారు.

ఎన్నికల నియమాలను పాటించాలి

▸▸ ఆదిలాబాద్ రూరల్ ఎస్సై విష్ణువర్ధన్



మాట్లాడుతున్న ఎస్సై విష్ణువర్ధన్

ఆదిలాబాద్ రూరల్/తలమడుగు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా మండలంలో జరిగే ప్రతీ ఒక్క గ్రామంలో పోలీసులు సూచించిన నియమాలను పాటించాలని ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని తెలిపారు. ప్రజలు ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని 100 మీటర్ల వద్ద 200 మీటర్ల వద్ద ప్రత్యేక నియమ నిబంధనలు ఉంటాయని అన్నారు. ప్రజల అనవసరంగా గుమిగూడి ఉండరాదని, పోలింగ్ కేంద్రాలలోనికి సెల్‌ఫోన్‌లు, వాటర్ బాటిల్‌లు, ఇంకు బాటిళ్లు, ఆయుధాలు, పెన్నులు, అగ్నికి సంబంధించిన వాటికి అనుమతులు ఉండవని అన్నారు. పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ కేంద్రాలలోనికి అనుమతి ఇస్తారని తెలిపారు. వాట్సాప్‌లో సోషల్ మీడియాలో ఇతరులకు రెచ్చగొట్టేలా కించపరిచేలా పోస్టులు పెట్టిన వారిపై పోలీసు నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భీంసారి, అంకోలి, తంతోలి గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసుల పట్ల ధైర్యం నమ్మకం పెంపొందించేందుకు కృషి చేయడం జరిగిందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేయడానికి పోలీసులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

తలమడుగులో ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎస్సై డి.రాధిక కోరారు. సోమవారం మండలంలోని రుయ్యాడి, తలమడుగు గ్రామాల్లో పోలీసు ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు వంద మీటర్ల, 200 మీటర్ల వద్ద 144 సెక్షన్ అమలు ఉంటుందన్నారు. అదే విధంగా ప్రజలు గుమ్మిగూడి ఉండరాదన్నారు. అంతేకాకుండా పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, వాటర్ బాటిల్స్, ఇంకు బాటిల్స్ పోలింగ్ కేంద్రంలోనికి అనుమతి లేదన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్ పద్ధతిని పాటించాలన్నారు.సునీతమైన ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తూ ప్రజలలో పోలీసుల పట్ల ధైర్యం, నమ్మకం పెంపొందించేందుకు కృషిచేయడం జరుగుతుందని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వర్తించడానికి జిల్లాపోలీస్ యంత్రాంగం కఠినమైన చర్యలతో విధులను నిర్వర్తిస్తుందని తెలిపారు.


ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జైనథ్ మండలం ఆనంద్ పూర్‌లోని పెన్ గంగ నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక పంజాబ్ చౌక్ వద్ద తనిఖీలు జరుపుతున్న సమయంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. ట్రాక్టర్ ఓనర్ అయిన మంజుల రాములు, డ్రైవర్ దుండగుల రమేష్ లు గతేడాది కాలంగా ఎటువంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు.

సెల్ ఫోన్ దొంగ అరెస్టు

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డీబీ మార్ట్ వద్ద ద్విచక్ర వాహనం నుంచి సెల్ ఫోన్ ను దొంగతనం చేసిన కేసులో యాసం నర్సింగ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. దొంగతనాల కట్టడికి పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఆకట్టుకుంటున్న స్వదేశీ హస్తశిల్ప మేళా



ప్రదర్శనలో చీరలను ఆసక్తిగా తిలకిస్తున్న మహిళలు

ఆదిలాబాద్‌టౌన్,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని టీటీడీవోస్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న స్వదేశీ హస్తశిల్ప మేళా సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది.తెలంగాణ,మహారాష్ట్ర,ఒడిశా, గుజరాత్, రాజస్థాన్, బీహార్, ఉత్తర ప్రదేశ్,హర్యానా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఉత్పత్తులను ఇందులో విక్రయిస్తున్నారు. ఆంటిక్ జ్యువెల్లరీ, హస్త కళల ఉత్పత్తులు ఆకట్టుకుంటున్నాయి. ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయని నిర్వాహకులు ఉన్ని కృష్ణన్ తెలిపారు. ఆదిలాబాద్ పరిసర ప్రాంతాల ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంప్యూటర్ టీచర్లను విధుల్లోకి తీసుకోవాలి

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కంప్యూటర్ విద్యను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో తిరిగి ప్రారంభిస్తున్న నేపథ్యంలో గతంలో పనిచేసిన కంప్యూటర్ టీచర్స్‌ను తిరిగి కొనసాగించాలని తెలంగాణ కంప్యూటర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈమేరకు సోమవారం డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్‌ను కలిసి వినతిపత్రం అందించగా... సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని భరోసా కల్పించారు. త్వరలోనే సీఎంను కలిపించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుధీర్, ప్రవీణ్, అనిల్, సునీల్, హేమంత్, స్వామి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పూజలు నిర్వహిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



పడిపూజ నిర్వహిస్తున్న తోట అశోక్ దంపతులు



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

ఇచ్చోడ/తలమడుగు/తాంసి,డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): అన్నదాన ప్రభువే శరణమయ్యా. ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప అంటూ.. అయ్యప్ప మాలధారులు, భక్తుల శరణుఘోషలతో పట్టణామంతా మారుమోగింది. సోమవారం అయ్యప్పస్వామి పల్లకి శోభాయాత్ర, ఆరట్టు మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఇచ్చోడ శ్రీ.ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయం నుంచి ప్రారంభమైన శోభయాత్ర మండల కేంద్రంలోని ప్రధాన వీధులగుండా కొమురంభీం, అంబేడ్కర్ చౌరస్తా, శివాజీ చౌరస్తా, రెడ్డికాలనీ, మార్కెట్‌గల్లీ మీదుగా సాయిబాబా ఆలయానికి చేరుకుని తిరిగి అయ్యప్పస్వామి ఆలయం వరకు యాత్ర సాగింది. మాలధారులు పల్లకి సేవతో పాటు భజన సంకీర్తణలు చేసుకుంటు.. ఓం శ్రీస్వామియే శరణమయ్యప్ప అంటూ స్వామి శరణుఘోషలతో పట్టణామంతా డీజే చప్పుళ్ల మధ్య స్వామి పల్లకిని ఊరేగించారు. గురుస్వాముల ఆధ్వర్యంలో కన్నేస్వామి, కత్తిస్వామి, గంటస్వామి, గదస్వామి, పేరుస్వాములు భజనతో పాటు నృత్యాలు చేశారు. అనంతరం ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ అవరణలో మహాభిక్ష నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు, ఇచ్చోడ, సిరికోండ, నేరడిగొండ, గుడిహత్నూర్ తదితర మండలాల నుంచి మాలధారులు, భక్తులు పెద్దఎత్తున హాజరై ఆరట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

హాజరైన బోథ్ ఎమ్మెల్యే

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవానికి సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప స్వాములతో కలిసి మహాభిక్షలో పాల్గొన్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో నిర్వహించిన అన్నప్రసాద దాతరాథోడ్ మౌనిక అనిల్‌ను ఎమ్మెల్యేశాలువాతో సత్కరించారు.ఆయన వెంట మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని సాయి లింగి గ్రామంలోని తోట అశోక్ ఆధ్వరంలో ఘనంగా అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప 18 మెట్లు ఏర్పాటుచేసి ఏర్పాటుచేసి మహాగణపతికి పూజలు నిర్వహించి, అనంతరం 18 మెట్లకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాకుండా తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల నుంచి వచ్చిన అయ్యప్ప స్వాములకు మహా అన్నదానం. నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అయ్యప్ప చూపిన సన్మార్గంలో నడుచుకోవాలని కోరారు. కాగా లింగ గ్రామానికి చెందిన తోట అశోక్ దంపతులు గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం అయ్యప్ప పడిపూజ స్వాములకు అన్నదాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇందులో గురు అయ్యప్ప స్వాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తాంసి మండలంలోని వడ్డాడి గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన అయ్యప్ప పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. వడ్డాడి గ్రామానికి చెందిన బైరెడ్డి శ్రీనివాస్ దంపతులు నిర్వహించిన ఈ మహాపడిపూజ అద్యంతం భక్తి పారవశంతో కొనసాగింది. వేద పండితుడు సంతోష శర్మ మంత్రోచ్చారణలు, కౌటా ప్రాంతానికి చెందిన ఉపేందర్ రెడ్డి భజన బృందంతో ఈ పడిపూజను నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పక్కన ఉన్న మహారాష్ట్ర నుంచి సైతం పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములు హాజరయ్యారు. తొమ్మిది పదార్థాలతో కూడిన అభిషేకాన్ని అయ్యప్ప స్వా మికి నిర్వహించారు. 18వ పడిని వెలిగించి మంగళహారతి గీతాన్ని ఆలపించి పడిపూజను ముగించారు. 18వ సారి దీక్ష తీసుకుంటున్న శ్రీనివాస్ రెడ్డిని పలువురు సన్మానించారు. అనంతరం తీర్థప్రసాదాలతో పాటు అల్పాహారాన్ని ఆరగించారు. ఈ పడిపూజ సోమవారం తెల్లవారు జాము వరకు కొనసాగింది.



పద్దెనిమిది మెట్లు వెలిగిస్తున్న దృశ్యం



పల్లకి సేవలో పాల్గొన్న మాలధారులు, భక్తులు

సీడ్ బిల్లుల్లో సవరణలు చేపట్టాలి



ప్రధానికి పంపనున్న లేఖలతో డీలర్లు

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన సీడ్ బిల్ 2025లో రైతులు, డీలర్లకు నష్టం కలిగించే కొన్ని అంశాలున్నాయని వాటిని సవరించాలని జిల్లా ఆగ్రో డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాటిపెల్లి శివప్రసాద్ అన్నారు. బిల్లును సవరించాలని కోరుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి పోస్టాఫీసు నుంచి లేఖలు పంపించారు. ప్రభుత్వం సవరణలు చేసి బిల్లును ప్రవేశపెట్టాలని కోరారు. నూతన విత్తన బిల్లు ముసాదాపై అభిప్రాయాలు, సూచనల కోసం కేంద్రం డీలర్లకు సూచించిందని, దానికి అనుగుణంగానే కొన్ని సవరణలు చేయాలని కోరుతూ కేంద్రానికి పోస్టు చేస్తున్నామని డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తాటిపెల్లి శివప్రసాద్ అన్నారు. కంపెనీ ప్యాక్‌లో ఏమైనా ఇబ్బందులు వస్తే డీలర్లను ఏవన్‌గా చూపించే విధంగా బిల్లు ఉందన్నారు. రైతులకు కూడా దీని వల్ల నష్టం కలుగుతుందన్నారు. అయితే దీంట్లో కొన్ని సవరణలు చేయాలని కోరుతూ లేఖలో పూర్తి అంశాలను పొందుపర్చి పంపిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కంఠం శంకర్, గంద్రత్ సంతోష్, కత్తూరి ప్రశాంత్, కిషోర్, రాజ్ కుమార్, శ్రీకాంత్, నాలం రాకేష్, ప్రకాష్ రెడ్డి, వాసవి శ్రీనివాస్, రేణుక సతీష్ పాల్గొన్నారు.

andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.3; కనిష్ఠం 12.7
ఆంధ్రజ్యోతి
నిర్మల్
జిల్లా వార్తలు
8
మంగళవారం 9 డిసెంబరు 2025



ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

» కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లను చేస్తున్నామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అభిలాష అభినవ్, సంబంధిత అధికారులతో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికలు నిర్వహించే అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు తక్షణమే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లు కలుగకూడదన్నారు. ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్లు, ఎంపీడీవోలకు మరొక్కసారి ఎన్నికల నిర్వహణ విధివిధానాలపై సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణలో జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఎన్నికల సిబ్బంది, సామగ్రి తరలింపునకు సరిపడినన్ని వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి, డీపీవో శ్రీనివాస్, డీఈవో భోజన్న, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు లోనుకావద్దు

» భైంసా రూరల్ సీఐ నైలు




కుంటాల మండలం కల్లూరులో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

కుంటాల, డిసెంబరు, 8 : (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడు వ్యసనాలకు లోను కావద్దని భైంసారూరల్ సీఐ నైలు అన్నారు. సోమవారం కుంటాల మండలంలోని కల్లూరు వాసవీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు పోలీసు అక్క, చట్టాలు, డ్రగ్స్ నిరోధకం, చదువు పట్ల ప్రాధాన్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. మానవ జీవితంలో విద్యార్థిదశ కీలకమైందని, ఈ దశలో చెడు వ్యసనాలకు లోనైతే జీవితంలో ఎన్నో అనార్థాలు ఎదురవుతాయని, విద్యార్థిని, విద్యార్థులు ఎలాంటి చెడువ్యసనాల పట్ల మొగ్గు చూపకూడదన్నారు. అంతేగాకుండా విద్యార్థినులు పోలీసు అక్క సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్, కుంటాల పోలీసు సిబ్బందితో పాటు వాసవీ కళాశాల ప్రిన్సిపాల్‌లు సాయిలు, శ్రీనివాస్, సంతోష్, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

పల్లెవ్యూహం..

ఓటరుకు పల్లె 'పంచాయితీ' పద్మ వ్యూహంలా తయారైంది. అన్ని పార్టీలు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. సారథులే స్వయంగా పల్లె బాట పడుతూ.. వ్యూహరచన చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఎన్నికల ప్రచార తీరు మారింది. విందులు, హామీలతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.



రంగంలోకి సీనియర్ నేతలు

» గ్రామ బాటపడుతున్న ముఖ్యనాయకులు
» రంగు మారుతున్న ప్రచారం
» వేకువ జాము నుంచే సందడి
» స్థానికంగా హామీల వర్షం... విందులు

నిర్మల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికలను అన్ని పార్టీల నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుండడంతో పోటీరోజు రోజుకు రసవత్తరంగా మారుతోంది. ప్రస్తుతం మొదటి, రెండో దఫా నామినేషన్‌లు, ఉపసంహరణల పర్వం పూర్తవ్వడంతో ఇక ప్రచారపర్వం మొదలైంది. కాంగ్రెస్, బీజేపీలతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు సైతం తమ పార్టీ మద్దతుదారులను గెలిపించుకునేందుకు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. వేకువజాము నుంచే తమ మద్దతుదారుల గెలుపు కోసం నేతలు పల్లె బాట పడుతుండడం ఆసక్తికరంగా మారుతోంది. పల్లె ప్రజ లు వ్యవసాయ పనుల కోసం పంట పొలాలకు వెళ్ళక ముందే వారి వద్దకు వెళ్ళి మద్దతును అభ్యర్థిస్తున్నారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే కొన్ని గ్రామ పంచాయతీల్లో మద్యం, నగదును పంపిణీ చేసేందుకు కూడా కొంత మంది అభ్యర్థులు రంగం సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పెద్దమొత్తంలో మద్యం నిల్వలను సమీకరించినట్లు సమాచారం. అలాగే ప్రస్తుతం పల్లెల్లోని బెల్ట్ షాపులకు సైతం భారీగా డిమాండ్ ఏర్పడుతోంది. బెల్ట్ షాపుల వద్ద జనం బారులు తీరుతున్నారు. ఈ బిల్లులన్ని కొన్ని గ్రామాల్లో పోటీచేసే అభ్యర్థులే బరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పల్లెబాటలో నేతలు....

కాగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలు పోటాపోటీగా పల్లెబాట పడుతున్నారు. బీజేపీ తరపున ఎమ్మెల్యేలు ఏలేటీ మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్‌లు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్‌లు తమ తమ పార్టీ నియోజకవర్గాల్లో పార్టీ సీనియర్ నాయకులకు ప్రచా ర బాధ్యతలను అప్పగిస్తున్నారు. వారు వెనక ఉండి నేతలకు ప్రచార వ్యూహాలను అందిస్తున్నారు. ఎమ్మెల్యేల అండతో సీనియర్ నాయకులు తమ మద్దతుదారుల గెలుపు కోసం ప్రచారం చేస్తూనే ఇతర పార్టీల నేతలను తమ పార్టీలోకి చేర్చుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే ఇలా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో చాలా మంది చేరారు. కాగా కాంగ్రెస్ పార్టీ తరపున డీసీసీ అధ్యక్షుడు బొజ్జు పటేల్ ఖానాపూర్ నియోజకవర్గంలోనూ, నిర్మల్ నియోజకవర్గంలో ఆ పార్టీ ఇన్‌చార్జీ శ్రీహరిరావు, ముథోల్ నియోజకవర్గంలో ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు నారాయణ రావు పటేల్, విఠల్ రెడ్డిలతో పాటు తదితరులు తమ పార్టీ మద్దతుదారుల తరపున ప్రచారం చేస్తున్నారు. వీరంతా ఉదయం నుంచే పల్లె ప్రచారాన్ని మొదలు పెడుతున్నారు. నాలుగు రోజుల నుంచి నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీహరిరావు మారుమూల పల్లెలను టార్గెట్‌గా చేసుకొని వేకువజాము నుంచే ప్రచారం నిర్వహిస్తుండడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మొత్తానికి నేతల ప్రచార పర్వంతో గ్రామాల్లో రోజు రోజుకు రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.

దొరకని ఓటరు నాడి

గ్రామీణ ఓటర్లు ప్రస్తుతం అత్యంత చాకచక్యంగా వ్యవహరిస్తున్నారంటున్నారు. అభ్యర్థులంతా తమకు పరిచయస్తులే కావడంతో ప్రచారం కోసం వచ్చే వారితో వారు అచితూచిగా మాట్లాడుతున్నారని చెబుతున్నారు. అందరికి ఒకే రకమైన భరోసాను కల్పిస్తూ వారి ప్రచారానికి స్పందిస్తున్నారని చెబుతున్నారు. ఎక్కడ కూడా నోరు జారకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. ప్రచారం కోసం వచ్చే అభ్యర్థులను వారు తమ ఇండ్లలోకి సాధారంగా ఆహ్వానిస్తూ ఓటు మీకే వేస్తామని చెబుతున్నారు. ఓటర్ల స్పందనను చూసి అభ్యర్థులంతా గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ఓ వీధి వారంతా తమకే మద్దతునిస్తున్నారని అలాగే కుల సంఘాలు, యూత్ సభ్యులు కూడా తమకే అండగా ఉంటున్నారంటూ ఎవరికి వారే అంచనాలు వేసుకుంటున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులందరూ ఎవరి ధీమాలో వారు ఉన్నారు.

ఏరియా ఆస్పత్రిని ఆధునికీకరిస్తాం



ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్‌కు మొక్కను అందజేస్తున్న అధికారులు



డ్రై క్లీనింగ్ విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్

● ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పాటిల్

భైంసా, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన రీతిలో వైద్యసేవలు అందించేందుకు గాను భైంసా ఏరియా ఆసుపత్రిని అధునీకరిస్తామని ము థోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ వెల్లడించారు. సోమవారం ఏరియా ఆసుపత్రిలో రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన డ్రైక్లీనింగ్ విభాగాన్ని డీసీహెచ్ఎస్ డా.సురేష్‌తో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలలో సౌకర్యాల మెరుగుదలకు, వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. సత్వర వైద్యసేవలు అందించేందుకు గాను అధునాతన వైద్యపరికరాలను అందుబాటులోకి తీసుకవస్తున్నామని వివరించారు. ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి పెరుగుతున్న దృష్ట్యా భైంసాలో ప్రత్యేకంగా ప్రసూతి ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు. ఇందుకోసం గాను ఐదు ఎకరాల స్థల సేకరణ చేపట్టినట్లుగా వెల్లడించారు. ఇందులో భైంసా, ముథోల్ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్లు డా.కాశీనాథ్, డా.అనిల్‌కుమార్ జాదవ్, రిటైర్డ్ డిప్యూ టీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.దామోదర్ రెడ్డి, లయన్స్‌క్లబ్ ప్రతినిధి డా.ముత్యం రెడ్డి, ఆరోగ్యభారతి ప్రతినిధి డా.ఎం.రామకృష్ణ గౌడ్, భైంసా డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధి డా.మహిపాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే అభ్యర్థులను గెలిపిస్తాయి

● రాష్ట్ర టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న వెంబడి రాజేశ్వర్

సారంగాపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు ప్రవేశ పెట్టినటువంటి సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపిస్తాయని రాష్ట్ర టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్ అన్నారు. సోమవారం సారంగాపూర్ మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చడంలో ముందుంటున్నారని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లోజి నర్సయ్య, నారాయణ్‌రెడ్డి, జగదీశ్వర్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు నిర్మల్‌కు రానున్న సాధువులు

నిర్మల్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర భారతదేశం నుంచి 300ల మంది సాధు, మహాత్ములు, సత్పురుషులు, సిద్ధపురుషులు గోదావరి పరిక్రమ (ప్రదక్షిణ) నిమిత్తం మంగళవారం నిర్మల్ రానున్నారని స్వాగత కమిటీ సభ్యుడు అరుణ్ శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి నది నాసిక్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర బాసర మీదుగా కాళేశ్వరం చేరుకుని, అక్కడి నుంచి భద్రాచలం తర్వాత రాజమండ్రి అంతర్వేదిలో తల్లి సముద్రంలో విలీనం అవుతుందన్నారు. మొత్తం ఈ యాత్ర 15 రోజులు సాగుతుందన్నారు. ఇందులో భాగంగా మంగళవారం నిర్మల్‌కు చేరుకుంటుందన్నారు. రాజా శ్యామల పీఠం, మహాదేవ శక్తి సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారికి స్థానిక ఈద్‌గాం చౌరస్తా వద్ద స్వాగతం పలికి, భారీ శోభాయాత్ర నిర్వహించామన్నారు. కార్యక్రమంలో భక్తులు, వ్యాపార, కుల, ఉద్యోగసంఘాలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొని ఆశీర్వచనం పొందాలని కోరారు.

నమునా ఎన్నికలు



కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో నమునా ఓటు వేస్తున్న విద్యార్థులు

కుంటాల, డిసెంబరు, 8 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నమునా ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎన్నికల కమిషన్ పనితీరుతో పాటు పార్లమెంట్ నుంచి పంచాయతీ వరకు ఎన్నికలు నిర్వహించే తీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్‌ల స్వీకరణ, ఉపసంహరణ, అభ్యర్థుల గుర్తుల కేటాయింపు, ప్రచారం, పోలింగ్ బూతుల ఏర్పాటు, పోలీసుల రక్షణ, బ్యాలెట్ పేపర్, ఓటు హక్కు వినియోగించుకునే విధానం, ఓట్ల లెక్కింపు, విజయం సాధించిన అభ్యర్థుల ప్రకటన, ధ్రువీకరణ పత్రాల అందజేత తదితర అంశాలపై ప్రిన్సిపల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్‌లు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

చిన్నారులకు నాట్య మయూరి పురస్కారాలు



నాట్య మయూరి అవార్డు అందుకున్న చిన్నారులు



నృత్యం చేస్తున్న చిన్నారులు

నిర్మల్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్‌కే కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం సంస్కార భారతి ఆధ్వర్యంలో నాట్య మయూరి పురస్కారాలు ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించినట్లు సంస్కార భారతి జిల్లా అధ్యక్షులు నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సంస్కార భారతి తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి జేపీ నిరంజన్ మాట్లాడుతూ... పంచ పరివర్తన్, కళల మాధ్యమం ద్వారా సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పాలని, చిన్నప్పటి నుంచి చిన్నారులకు కళల ద్వారా దేశభక్తిని, భారతీయ కళల ఔన్నత్యాన్ని తెలుపాలన్నారు. చిన్నారుల నృత్య ప్రదర్శనల అనంతరం చిన్నారులకు నాట్య మయూరి పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణంరాజు, డాక్టర్ చంద్రిక, నాగభూషణ్, సభ్యులు నవ్య, పోలీస్ భీమేష్, మాధురి, రాజు, బన్ని, శ్రీకాంత్, స్వరూపిణి నృత్య కళాక్షేత్రం చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు

● డీఎం పండరి

నిర్మల్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ నిర్మల్ డిపో నుంచి శబరిమలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కే.పండరి తెలిపారు. స్వాములు కాని నాన్‌స్వాములు కాని బుక్ చేసుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. నిర్మల్ నుంచి కాణిపాకం, అరుణాచలం, శ్రీరంగం, పలని, శబరిమల వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు మధురై నుంచి నిర్మల్‌కు చేరుకుంటుందని, 6 రోజుల ప్రయాణం, ఒకరికి టికెట్ ధర రూ. 7,650 ఉంటుందని, ఎలాంటి టోల్ టాక్స్‌లు, బార్డర్ టాక్స్‌లు ప్రయాణికుల వద్ద వసూలు చేయమని ఆయన తెలిపారు. దర్శనానికి వెళ్లి వచ్చే వారికి సౌకర్యంగా ఉంటుందని, మరిన్ని వివరాలకు 9959226003, 8328021517, 7382842582లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆర్మూర్ - నిర్మల్ - ఆదిలాబాద్ రైల్వే లైన్‌ను

వెంటనే నిర్మించండి

» రాజ్యసభలో ఎంపీ నిరంజన్ రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు వెంటనే రైల్వే లైన్‌ను నిర్మించాలని, దీనికి అవసరమైన నిదులును కేంద్ర రైల్వే శాఖ మంజూరు చేయాలని రాజ్యసభ సభ్యుడు నిర్మల్‌కు చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది నిరంజన్ రెడ్డి కోరారు. సోమవారం రాజ్యసభలో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. 2010-11 సంవత్సరంలో ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు 136 కిలో మీటర్ల పొడవుతో రైల్వే లైన్‌కు సంబంధించిన సర్వే పనులు కూడా పూర్తయ్యాయని వివరించారు. ఆర్మూర్ - ఆదిలాబాద్ రైల్వేలైన్ సౌకర్యం లేని కారణంగా ఆదిలాబాద్ ప్రజలు రైలులో హైదరాబాద్ వెళ్లాలంటే నాగపూర్ మీదుగా 400ల కిలోమీటర్ల మేరకు ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ఆర్మూర్ - ఆదిలాబాద్ రైల్వే లైన్ పూర్తయితే ఇక్కడ ప్రజలకు దూరభారం తగ్గుతుందన్నారు. గత 50 సంవత్సరాల నుంచి ఈ ప్రాంత ప్రజలు రైల్వే లైన్ కోసం డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. దాదాపు 7 లక్షల పైగా జనాభా ఉన్న ఈ ప్రాంతానికి ఇప్పటివరకు రైల్వేలైన్ సౌకర్యం లేదన్నారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలింగ్ రోజు జిల్లాలో సెలవులు

నిర్మల్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ తేదీల సందర్భంగా ఎన్నికల కమిషనర్ ఆదేశానుసారం కలెక్టర్ అభిలాష అభినవ్ సెలవు ప్రకటించారు. ఈ నెల 11, 14, 17 తేదీల్లో ఎన్నికల కోసం గ్రామాల్లోని పాఠశాలలో పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలు ఉన్న ప్రాంతాలలో ప్రభుత్వ ఆమోదిత సంస్థలకు పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు సెలవులు ప్రకటించారు.

బాధితుల సమస్యలు పరిష్కరించండి

● ఎస్పీ జానకి షర్మిల



బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ

నిర్మల్ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బాధితుల సమస్యలను తక్షణ పరిష్కారం కోసమే గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ డా. జి.జానకి షర్మిల అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. అప్పుడే ఫిర్యాదుదారులకు పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్‌డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

ముథోల్‌లో ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ముథోల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నిర్మల్ ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా నేతృత్వంలో ముథోల్ సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ... ఫ్లాగ్‌మార్చ్ ప్రజల్లో నమ్మకం పెంపొందించడం, శాంతి భద్రతలు కాపాడడం, ఎన్నికల ప్రక్రియలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడం లక్ష్యంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలందరూ ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించి, ఎన్నికల నియమాలు పాటించి, ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో గందరగోళం సృష్టించడం, బెదిరింపులకు పాల్పడిన, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసు యంత్రాంగం స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, శాంతియుత ఎన్నికలు నిర్వహించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ముథోల్ సీఐ మల్లేష్, బాసర సీఐ సాయి కుమార్, ఎస్సైలు బిట్ల పెర్సిస్, అశోక్, గంగాధర్, నవనీత్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.